క్లుప్తంగా

విద్యుత్ లైన్ ఏర్పాటుకు మంత్రికి వినతి



అమ్మనబ్రోలు ముస్లింకాలనీ వాసులతో మాట్లాడుతున్న మంత్రి నాగార్జున

నాగులుప్పలపాడు: దీర్ఘకాలికంగా తమ కాలనీలో ఉన్న విద్యుత్ సమస్యను పరిష్కరించాలని అమ్మనబ్రోలు గ్రామ ముస్లింకాలనీ వాసులు మంత్రి మేరుగు నాగార్జునకు బుధవారం వినతిపత్రం అందజేశారు. అమ్మనబ్రోలు విచ్చేసిన మంత్రి నాగార్జునకు కాలనీ వాసులంతా ఉమ్మడి సమస్యలు పరిష్కరించాలని అడగ్గా, వెంటనే సంబంధిత అధికారులకు మంత్రి సూచనలు చేశారు. ముస్లింకాలనీలో సమస్యలను వెంటనే పరిష్కరించాలని ఆదేశించారు.

మహాశివరాత్రికి రామతీర్థంలో అన్నదానం



కార్యక్రమంలో పాల్గొన్న మారం వెంకారెడ్డి, సత్రం సభ్యులు

చీమకుర్తి: రానున్న మహాశివరాత్రి పర్వదినాన రామతీర్థం పుణ్యక్షేత్రంలోని యోగివేమన రెడ్ల సత్రంలో భక్తులకు ఉచితంగా అన్నదానం ఏర్పాట్లు చేస్తున్నట్లు సత్రం అధ్యక్షుడు మారం వెంకారెడ్డి తెలిపారు. సత్రం కమిటీ సభ్యులను బుధవారం కలిసి అన్నదానం ఏర్పాట్లపై సమీక్షించారు. కార్యక్రమంలో సత్రం కమిటీకి చెందిన క్రిష్టిపాటి శేఖరరెడ్డి, అంబటి వీరారెడ్డి, గంగిరెడ్డి ఓబుల్‌రెడ్డి, స్థానిక నాయకులు పాల్గొన్నారు.

హాకీ పోటీలకు రూ.25 వేలు అందజేత



విరాళం అందిస్తున్న మారం వెంకారెడ్డి

చీమకుర్తి: సంతనూతలపాడు మండలం మైనంపాడు ప్రభుత్వ హైస్కూల్లో మహిళల హాకీ టోర్నమెంట్ నిర్వహణకు వైఎస్సార్ సీపీ అద్దంకి నియోజకవర్గ పరిశీలకుడు మారం వెంకారెడ్డి బుధవారం రూ.25 వేల విరాళాన్ని నిర్వాహకులకు అందించారు. మార్చి 8, 9, 10 తేదీల్లో 14వ రాష్ట్రస్థాయి ఉమెన్స్ హాకీ పోటీల్లో రాష్ట్రంలోని పలు ప్రాంతాల నుంచి రూ.250 మంది మహిళా హాకీ క్రీడాకారిణులు పాల్గొంటున్నట్లు నిర్వాహకుడు మైనంపాడు పీఈటీ రవి తెలిపారు. ఈ సందర్భంగా మారం వెంకారెడ్డిని నిర్వాహకులు అభినందించారు.

బీజేపీ పోరు యాత్ర నిర్వహణ

ఒంగోలు సెంట్రల్: నగరంలో బీజేపీ ఒంగోలు నియోజకవర్గ ఇన్‌చార్జి వైసీ యోగయ్య యాదవ్ ఆధ్వర్యంలో గోరంట్ల కాంప్లెక్స్, రైల్వే స్టేషన్, నెల్లూరు బస్టాండ్, పెళ్లూరులో బుధవారం పోరుయాత్ర నిర్వహించారు. పలు సమస్యలపై మాట్లాడారు. పార్టీ ఒంగోలు పార్లమెంట్ కన్వీనర్ సెగ్గెమ్ శ్రీనివాసరావు, జిల్లా ప్రధాన కార్యదర్శి శివాజీ యాదవ్, సీతారామయ్య, అజయ్, సత్యనారాయణ, ధనిశెట్టి రాము తదితరులు పాల్గొన్నారు.

జంకెను కలిసిన ఎమ్మెల్యే అన్నా రాంబాబు



జంకె, రాంబాబును సన్మానిస్తున్న పార్టీ నాయకులు

మార్కాపురం టౌన్: ఏపీఐఐసీ చైర్మన్, వైఎస్‌ఆర్ సీపీ జిల్లా అధ్యక్షుడు జంకె వెంకటరెడ్డిని బుధవారం ఆయన నివాసంలో మార్కాపురం నియోజకవర్గ వైఎస్‌ఆర్ సీపీ సమన్వయకర్త, గిద్దలూరు ఎమ్మెల్యే అన్నా రాంబాబు కలిసి పార్టీ పరిస్థితిపై మాట్లాడారు. ఎన్నికల్లో అనుసరించాల్సిన వ్యూహాలను చర్చించారు. వీరిని పొదిలి మండలం వైఎస్సార్ సీపీ నాయకులు అంజిరెడ్డి, కొండారెడ్డి, కోటిరెడ్డి, శ్రీనివాసరెడ్డి, వెంకటేశ్వర్లు తదితరులు సన్మానించారు. పొదిలి మండలంలో పార్టీ అభివృద్ధికి సహకరించాలని విజ్ఞప్తి చేశారు.

సీఎంఆర్‌ఎఫ్ చెక్కు పంపిణీ

పొదిలి రూరల్: పొదిలి మండలం బుచ్చన్నపాలెం గ్రామానికి చెందిన పల్లెర్ల చిన వెంకటేశ్వర్లు మోకాలు ఆపరేషన్ చేయించుకున్నాడు. దీనికి ముఖ్యమంత్రి సహాయ నిధికి దరఖాస్తు చేసుకోవడంతో సీఎం రిలీఫ్ ఫండ్ నుంచి రూ.65 వేలు మంజూరయ్యాయి. పొదిలిలో బుధవారం గిద్దలూరు ఎమ్మెల్యే, మార్కాపురం సమన్వయకర్త అన్నా వెంకట రాంబాబు చేతుల మీదగా బాధితునికి చెక్కు పంపిణీ చేశారు. బాధితుడు వెంకటేశ్వర్లు జగనన్నకు, ఎమ్మెల్యేకు కృతజ్ఞతలు తెలిపారు. వైఎస్సార్‌సీపీ నాయకులు సాని కొమ్ము శ్రీనివాసరెడ్డి, కల్లం సుబ్బారెడ్డి, కేవీ రమణారెడ్డి, జి శ్రీనివాసులు, చెన్నారెడ్డి, నూర్జహాన్ బేగం, గౌసియా బేగం, వినోద్, నాయబ్ రసూల్, రోటీబ్రదర్స్, నాయకులు పాల్గొన్నారు.

ఘనంగా సైన్స్ దినోత్సవం



మంగమూరులో విద్యార్థులకు ప్రశంసపత్రాలు అందిస్తున్న హెచ్‌ఎం



ఆలూరు హైస్కూల్లో విద్యార్థులకు బహుమతులు అందజేస్తున్న హెచ్‌ఎం కోటమ్మ

ఒంగోలు: జాతీయ సైన్స్ దినోత్సవాన్ని ఒంగోలు నగరంలోని పలు పాఠశాలలు, కాలేజీల్లో బుధవారం ఘనంగా నిర్వహించారు. స్థానిక డీఎస్ ప్రభుత్వ మహిళా డిగ్రీ కాలేజీ, మాంటిస్సోరి ఉన్నత పాఠశాల, డ్రీమ్స్ ఉన్నత పాఠశాల, శ్రీచైతన్య భాగ్యనగర్ బ్రాంచ్, భాష్యం ఉన్నత పాఠశాల, నారాయణ సీఓ అండ్ ఒలంపియాడ్ ఉన్నత పాఠశాలతో పాటు అనేక విద్యాసంస్థల్లో సైన్స్ ప్రాజెక్టులు రూపొందించారు. సైన్స్ పట్ల తమకున్న ఆసక్తిని విద్యార్థులు కనబరిచారు. ప్రతిభ కనబరిచిన వారికి యాజమాన్యాలు బహుమతులు అందించి అభినందించాయి. నారాయణ సీవో అండ్ ఒలంపియాడ్ ఉన్నత పాఠశాలలో సైన్స్ ప్రదర్శనను తాలూకా సీఐ భక్తవత్సలరెడ్డి, డీసీఆర్‌బీ సీఐ భీమానాయక్ సందర్శించి విద్యార్థులను అభినందించారు.

సాంకేతిక పరిజ్ఞానంతోనే మంచి భవిష్యత్...

కొత్తపట్నం: సాంకేతిక పరిజ్ఞానంతోనే విద్యార్థుల భవిష్యత్ బాగుంటుందని ఆలూరు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు జి.కోటమ్మ అన్నారు. జాతీయ సైన్స్ దినోత్సవాన్ని పురస్కరించుకుని ఆలూరు, కొత్తపట్నం హైస్కూళ్లలో బుధవారం వేడుకలు నిర్వహించారు. సైన్స్ ప్రాధాన్యత, విద్యార్థులకు భవిష్యత్‌లో ఏ విధంగా ఉపయోగపడుతుందనే విషయాలను వివరించారు. సైన్స్ గురించి వ్యాసరచన, వక్తృత్వ, డ్రాయింగ్ పోటీలు నిర్వహించారు. విద్యార్థులకు వివిధ ప్రయోగాలు ప్రదర్శించడంతో పాటు సైన్స్ బొమ్మలు, ముగ్గుల రూపంలో ప్రదర్శించారు. సైన్స్ ఉపాధ్యాయులు బి.తిరుపతయ్య, బాలునాయక్ ఆధ్వర్యంలో పోటీల్లో గెలిచిన విద్యార్థులకు బహుమతులు అందజేశారు. కొత్తపట్నం హైస్కూల్‌లో హెచ్‌ఎం ఎం.శ్రీదేవి ఆధ్వర్యంలో సీవీ రామన్ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. పత్రే వెంకట్రావు, సైన్స్ ఉపాధ్యాయురాలు ఉష,



డ్రీమ్స్ ఉన్నత పాఠశాలలో విద్యార్థులు ప్రదర్శిస్తున్న సైన్స్ ప్రాజెక్టు



శ్రీచైతన్య భాగ్యనగర్ బ్రాంచ్‌లో సైన్స్ ప్రాజెక్టు ప్రదర్శిస్తున్న విద్యార్థులు

ఉపాధ్యాయులు శ్రీనివాసన్, సుధాకర్, జే ఆంజనేయులు, టి.గిరీష్, టి.వెంకటేశ్వర్లు, సీహెచ్ ఆశాజ్యోతి, రమాదేవి, లక్ష్మీకుమారి, హరిబాబు, నాగేశ్వరరావు, సుబ్బారెడ్డి, సంధ్యారాణి, ధనలక్ష్మి, నిర్మలాదేవి, శరత్‌చంద్ర, శేషారావు, కృష్ణయ్య, మధు, జిలాని, శేషగిరి, సుబ్రహ్మణ్యం, చంద్రశేఖర్ తదితరులు పాల్గొన్నారు.

చీమకుర్తి, సంతనూతలపాడు మండలాల్లో...

చీమకుర్తి: సైన్స్ దినోత్సవాన్ని పురస్కరించుకుని చీమకుర్తి, సంతనూతలపాడు మండలాల్లోని ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలల్లో బుధవారం ఘనంగా వేడుకలు నిర్వహించారు. విద్యార్థులచే తయారు చేయబడిన సైన్స్ ప్రాజెక్టులను పాఠశాల ప్రాంగణాలలో ప్రదర్శించారు. విద్యార్థులను అభినందించారు. సంతనూతలపాడు మండలం మంగమూరు జిల్లాపరిషత్ ఉన్నత పాఠశాలలో విద్యార్థులు ప్రదర్శించిన సైన్స్ ప్రాజెక్టులను అభినందించి స్థానిక హెచ్‌ఎం సుధాకర్, ఆఫ్‌కాస్ట్ కోఆర్డినేటర్ రమేష్‌తో పాటు ఉపాధ్యాయుల ఆధ్వర్యంలో విద్యార్థులకు ప్రశంసపత్రాలు అందించారు. చీమకుర్తి జిల్లాపరిషత్ బాలికల ఉన్నత పాఠశాలలో హెచ్‌ఎం జీ వీరాస్వామి, బండ్లమూడి జిల్లాపరిషత్ ఉన్నత పాఠశాలలో స్థానిక ఉపాధ్యాయులు, విద్యార్థులను అభినందించారు.

నాగులుప్పలపాడులో...

నాగులుప్పలపాడు: వాస్తవాలను ఆలోచించడానికి విద్యార్థులకు సైన్స్ చాలా ఉపయుక్తంగా ఉంటుందని మండల విద్యాశాఖాధికారి రవి అన్నారు. జాతీయ సైన్స్ దినోత్సవం సందర్భంగా బుధవారం మండలంలోని పలు పాఠశాలల్లో ఘనంగా వేడుకలు నిర్వహించారు. నాగులుప్పలపాడు ఆక్రిడ్జ్ పాఠశాలలో విద్యార్థులు పలు సైన్స్ ప్రాజెక్టులు ప్రదర్శించగా ఎంఈవో రవి వాటిని పరిశీలించి విద్యార్థులను అభినందించారు. సైన్స్‌పై విద్యార్థులకు వ్యాసరచన, వక్తృత్వ పోటీలు నిర్వహించి బహుమతులు అందజేశారు. అమ్మనబ్రోలు, నిడమానూరు గ్రామాల జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలల్లో విద్యార్థులకు పలు పోటీలు నిర్వహించి బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ బాలకృష్ణ, తదితరులు పాల్గొన్నారు.



నాగులుప్పలపాడు ఆక్రిడ్జ్ పాఠశాలలో సైన్స్ ప్రాజెక్టులను పరిశీలిస్తున్న ఎంఈవో రవి



నారాయణ సీఓ అండ్ ఒలంపియాడ్ పాఠశాలలో సైన్స్ ప్రాజెక్టులను పరిశీలిస్తున్న తాలూకా సీఐ



మాంటిస్సోరి స్కూల్లో చిన్నారుల సైన్స్ ప్రదర్శన



మహిళలతో మాట్లాడుతున్న బాలినేని శచీదేవి, శ్రీకావ్య

ప్రచారంలో పెరిగిన జోష్

- ఆడపడుచు మాదిరి ప్రతి ఇంట్లో అపూర్వ ఆదరణ
- 36వ డివిజన్‌లో మహిళలతో మమేకం–స్త్రీశక్తితో శచీదేవి కార్యక్రమం

ఒంగోలు: ఒంగోలు ఎమ్మెల్యే, మాజీ మంత్రి బాలినేని శ్రీనివాసరెడ్డి సతీమణి బాలినేని శచీదేవి నిర్వహిస్తున్న ఎన్నికల ప్రచారంలో జోష్ పెరిగింది. ఆడపడుచు మాదిరి ప్రతి ఇంటిలో ఆమెకు అపూర్వ ఆదరణ లభిస్తోంది. తద్వారా వైఎస్సార్ సీపీ క్యాడర్‌లో కూడా ఉత్సాహం రెట్టింపయింది. మహిళలతో మమేకం–స్త్రీశక్తితో శచీదేవి కార్యక్రమంలో భాగంగా స్థానిక 36వ డివిజన్‌లో కోడలు శ్రీకావ్యతో కలిసి బుధవారం ఆమె పర్యటించారు. ప్రతి ఇంటికి వెళ్లి ప్రజలను కలిశారు. స్థానిక అయ్యప్ప స్వామి వీధిలో ఎక్కువమందికి బాలినేని కుటుంబంతో ప్రత్యక్ష సంబంధాలు ఉన్నాయి. దీంతో వారు ఆప్యాయంగా శచీదేవి, శ్రీకావ్యలను ఆహ్వానించారు. ప్రతి ప్రభుత్వ పథకాన్ని పేదలకు అందించేందుకు శక్తివంచన లేకుండా కృషిచేస్తున్నామని, ఇంకా ఎవరికైనా సాంకేతిక ఇబ్బందుల కారణంగా పథకాలకు దూరమైతే తమ కుటుంబం అండగా నిలుస్తుందని శచీదేవి, శ్రీకావ్య వివరించారు. గతంలో ఎక్కడ పడితే అక్కడ చెత్త ఉండేదని, నేడు చెత్త బండ్లు వస్తుండడంతో చెత్త రోడ్లపై ఉండటం లేదని, తద్వారా దోమల బెడద కూడా గతం కంటే తగ్గిందని ప్రజలు తెలిపారు. ప్రతిపక్షాలు చేసే విమర్శలను పట్టించుకోవాల్సిన అవసరం లేదని, రాబోయే ప్రభుత్వం జగనన్నదే అని, తప్పకుండా మళ్లీ వాసన్నను మంత్రిగా చూస్తామని ప్రజలే చెబుతూ ఆనందం వ్యక్తం చేశారు. అనంతరం శచీదేవి మీడియాతో మాట్లాడుతూ కుటుంబ సభ్యుల్లా తమను ఆదరిస్తున్న తీరు ఆనందంగా ఉందన్నారు. మంచికి ఓటమి ఉండదని, మంచి చేశాం కనుకనే ప్రజల వద్దకు ధైర్యంగా వెళ్లగలుగుతున్నామని అన్నారు. తాము మంచి చేశాం కాబట్టే ప్రజలు కూడా తమను సాదరంగా ఆహ్వానిస్తున్నారన్నారు. తమపై స్థానిక ప్రజలు కనబరుస్తున్న ఆప్యాయత, అనురాగాలు జీవితకాలం తమ మదిలో ఉండిపోతాయన్నారు. అందరూ బాగుండాలని, ఎటువంటి సమస్య రాకూడదని భగవంతుడ్ని ప్రార్థిస్తున్నామన్నారు. ఎవరికైనా ఏదైనా సమస్య వస్తే మీ కుటుంబంలో ఒకడిగా మమ్మల్ని ఎప్పుడైనా కలవవచ్చని ప్రతి ఇంటికి తెలియజేశారు. కార్యక్రమంలో స్థానిక కార్పొరేటర్ దాకా సుజాత హనుమారెడ్డి, కార్పొరేటర్లు నీలంరాజు సరోజ, వేమూరి భవాని, పెద్దిరెడ్డి నియంతకుమారి, తాడి కృష్ణలత, తన్నీరు నాగజ్యోతి నాగేశ్వరరావు, స్థానిక నాయకులు చలపతిరావు, గంగాధర్, సుబ్రహ్మణ్యం, నాగకుమార్‌శర్మ, వాసు, వైఎస్సార్ సీపీ మహిళా విభాగం జిల్లా, నగర అధ్యక్షులు తమ్మినేని మాధవి, చింతగుంట్ల సువర్ణ, ఆగ్రోస్ డైరెక్టర్ పురిణి ప్రభావతి, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి బైరెడ్డి అరుణ, మహిళా విభాగం జిల్లా ప్రధాన కార్యదర్శి బత్తుల మరియమ్మ, తూము పద్మ, ఏపీసీపీడీసీఎల్ డైరెక్టర్ జిల్లెళ్లమూడి రమాదేవి, కార్పొరేషన్ ఎక్స్ అఫీషియో మెంబర్ షేక్ రషీద, 36వ డివిజన్ పార్టీ అధ్యక్షుడు జేమ్స్, ట్రేడ్ యూనియన్ నగర అధ్యక్షుడు గోవర్ధన్‌రెడ్డి, సేవాదళ్ నగర అధ్యక్షుడు వల్లెపు మురళి, తోటపల్లి సోమశేఖర్ తదితరులు పాల్గొన్నారు.

వైభవంగా ధ్వజస్తంభం ప్రతిష్ఠ



తాటిపర్తి చంద్రశేఖర్ ప్రత్యేక పూజలు

త్రిపురాంతకం: శ్రీ పార్వతి త్రిపురాంతకేశ్వర స్వామి దేవస్థానంలో ఆదిత్యాది నవగ్రహ, కాలభైరవ సహిత ధ్వజ స్తంభ పునఃప్రతిష్ఠ కార్యక్రమాలు వేదపండితుల మంత్రోచ్ఛరణలు మంగళ వాయిద్యాల మధ్య వైభవంగా నిర్వహించారు. వేలాది మంది భక్తులు తరలి వచ్చి ప్రత్యేక పూజా కార్యక్రమాల్లో పాల్గొన్నారు. హరహర మహాదేవ శంభో శంకర అంటూ భక్తజనులు నినాదాలతో మార్మోగింది. త్రిపురాంతకం దేవస్థానంలో ఈ నెల 24వ తేదీ నుంచి ధ్వజ స్తంభ ప్రతిష్ఠ కార్యక్రమాల సందర్భంగా ప్రత్యేక పూజలు వేదపండితులు వెల్లటూరు శివరామకృష్ణ శర్మతో నిర్వహిస్తున్నారు. ధ్వజస్తంభంతో పాటు కాలభైరవ, నవగ్రహాలు ప్రతిష్ఠ కార్యక్రమాలు జరిగాయి. ప్రత్యేకంగా లక్ష్మి గణపతి హోమం, మహారుద్ర హోమం, నీరాజన మంత్ర పుష్పం, చతుర్వేద పారాయణం, దర్బారు సేవ, స్వామి, అమ్మవార్లకు ప్రత్యేక పూజలు పండితులు విశ్వనారాయణ శాస్త్రి, ప్రసాదశర్మలు ఆధ్వర్యంలో జరిగాయి. ఆలయాల వద్ద ప్రత్యేక పూజల ఏర్పాట్లను ట్రస్ట్ బోర్డు చైర్మన్ సుబ్బారావు, ఈఓ చెన్నకేశవరెడ్డిలు నిర్వహించారు. కంచి కామకోటి పీఠాధిపతి జగద్గురు శంకరాచార్య శ్రీ శంకర విజయేంద్ర సరస్వతి స్వామివారు వచ్చి ప్రత్యేక పూజల్లో ఒక రోజు పాల్గొన్నారు. వైఎస్సార్ సీపీ యర్రగొండపాలెం సమన్వయకర్త తాటిపర్తి చంద్రశేఖర్, ఎంపీపీ కోట్ల సుబ్బారెడ్డి, మాజీ ఎంపీపీ ఆళ్ల ఆంజనేయరెడ్డి, పార్టీ కన్వీనర్ ఎస్.పోలిరెడ్డి, బీసీ సెల్ జిల్లా కార్యదర్శి ఆర్.పిచ్చయ్య యాదవ్, మల్లికార్జున్, సుబ్రహ్మణ్యం, గుప్త, ట్రస్ట్‌బోర్డు సభ్యులు గోపిశెట్టి వెంకటేశ్వర్లు, మన్నవ వెంకటేశ్వర్లు, పాతకోటి రమణమ్మ వెంకటేశ్వర్లు, ఆళ్ల వెంకటేశ్వరరెడ్డి, ఇతర ప్రముఖులు ఆలయాల ప్రత్యేక పూజల్లో పాల్గొన్నారు. అనంతరం అన్నదానం చేశారు. మహిళలు కోలన్న ప్రదర్శన అలరించింది.

కార్యకర్తల మృతికి నివాళులు



పులి వేణుబాబు మృతదేహానికి నివాళులర్పిస్తున్న మంత్రి నాగార్జున

నాగులుప్పలపాడు: వైఎస్సార్ సీపీ కార్యకర్తల కుటుంబాలకు పార్టీ, తాను ఎల్లప్పుడూ అండగా ఉంటామని రాష్ట్ర సాంఘిక సంక్షేమ శాఖామంత్రి, వైఎస్సార్ సీపీ సంతనూతలపాడు నియోజకవర్గ ఇన్‌చార్జి మేరుగు నాగార్జున హామీ ఇచ్చారు. బుధవారం చదలవాడ గ్రామంలో పార్టీ కార్యకర్త పులి వేణుబాబు మృతదేహానికి నివాళులర్పించారు. అనంతరం మట్టిగుంట గ్రామంలో హైకోర్టు న్యాయవాది యాదాల కిషోర్ తండ్రి యాదాల కృపారావు మరణించడంతో ఆయన మృతదేహానికి నివాళులర్పించారు. అనంతరం చవటపాలెం గ్రామంలో మాజీ సర్పంచ్ మన్నె వెంకటేశ్వర్లు బావ కాట్రగడ్డ సుబ్బారావు పెద్ద కర్మకు హాజరై సుబ్బారావు చిత్రపటానికి నివాళులర్పించారు. మంత్రి వెంట వైఎస్సార్ సీపీ నాయకుడు నలమలపు కృష్ణారెడ్డి, ఆరోగ్యశ్రీ ప్రత్యేకాధికారి యాదాల అశోక్, లిడ్ క్యాప్ డైరెక్టర్ కంచర్ల సుధాకర్, పోలినేని కోటేశ్వరరావు, కాట్రగడ్డ శ్రీనివాసరావు తదితరులు ఉన్నారు.

క్షతగాత్రులకు తాటిపర్తి ఆర్థిక సాయం

పుల్లలచెరువు: ఇటీవల మండలంలోని మర్రివేములలో ట్రాక్టర్ ప్రమాదంలో గాయపడి వినుకొండలో వైద్యసేవలు పొందుతున్న క్షతగాత్రులను యర్రగొండపాలెం నియోజకవర్గ వైఎస్సార్ సీపీ ఇన్‌చార్జి తాటిపర్తి చంద్రశేఖర్ బుధవారం పరామర్శించారు. క్షతగాత్రులకు అందుతున్న వైద్యసేవల గురించి డాక్టర్‌ను అడిగి తెలుసుకుని మెరుగైన వైద్యసేవలు అందించాలన్నారు. క్షతగాత్రులకు చంద్రశేఖర్ రూ.35 వేలు అందజేశారు. ఈయన వెంట ఏఎంసీ చైర్మన్ సింగారెడ్డి పోలిరెడ్డి, మాజీ ఏఎంసీ చైర్మన్ శ్రీనివాసరెడ్డి, నాయకులు రోసిరెడ్డి, గడ్డం సుబ్బయ్య ఉన్నారు.

దివ్యాంగ జంటకు ఘనంగా రిసెప్షన్



అనాథ జంటను ఆశీర్వదిస్తున్న అతిథులు

ఒంగోలు టౌన్: వాళ్లిద్దరూ అనాథలు. పైగా దివ్యాంగులు. వివాహం చేసుకున్నారు. అందరి సమక్షంలో రిసెప్షన్ జరుపుకోవాలని వారి కోరిక. ఆ జంట కోరికను నెరవేర్చింది సూర్యశ్రీ దివ్యాంగ చారిటబుల్ ట్రస్ట్. శివకుమార్, మహాలక్ష్మిల అనాథ దివ్యాంగ జంట ఇటీవల హైదరాబాద్‌లో వివాహం చేసుకోగా, ప్రవాస భారతీయురాలు స్వర్ణలత కుమారుడు కట్టా అలెన్‌బాబు నేతృత్వంలో రిసెప్షన్ వేడుకను స్థానిక ట్రస్ట్ కార్యాలయంలో బుధవారం ఘనంగా నిర్వహించారు. ట్రస్ట్ కార్యదర్శి షేక్ సర్దార్, మండవ మురళీకృష్ణ, ఆరెన్ త్యాగరాజు, షేక్ మహబూబ్, శరత్‌బాబు, మార్రెళ్ల సుబ్బారావు, గొర్రెపాటి శ్రీనివాసరావు, మండవ లావణ్య, ఆదిలక్ష్మి, కోచూరి శ్రీదేవి, కొమ్మి రమణయ్య రాజేశ్వరి, తొట్టెంపూడి సుజాత తదితరులుహాజరై నూతన దంపతులను ఆశీర్వదించారు. సహృదయంతో మంచి కార్యక్రమం నిర్వహించిన ట్రస్ట్ నిర్వాహకులు షేక్ షహనాజ్, సర్దార్ దంపతులను అభినందించారు.

శాస్త్ర సాంకేతిక రంగాలను ప్రోత్సహించాలి



జేవీవీ పతాకాన్ని ఆవిష్కరిస్తున్న నాయకులు

ఒంగోలు టౌన్: శాస్త్ర సాంకేతిక రంగాల్లో పరిశోధనలకు, ప్రయోగాలకు తగినన్ని నిధులు కేటాయించి ప్రోత్సహించాలని జనవిజ్ఞాన వేదిక జిల్లా గౌరవ సలహాదారు ఏవీ పుల్లారావు కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలకు విజ్ఞప్తి చేశారు. బుధవారం ఎల్బీజీ భవన్ వద్ద జేవీవీ ఆవిర్భావ దినోత్సవాన్ని నిర్వహించారు. జేవీవీ పతాకాన్ని ఆవిష్కరించిన అనంతరం పుల్లారావు మాట్లాడుతూ ఆకాశంలో రాకెట్లను పంపడంతో పాటుగా అడవిలో ఉన్నవారికి కూడా అభివృద్ధి, విజ్ఞానం అందేలా చర్యలు తీసుకోవాల్సిన అవసరం ఉందన్నారు. శాస్త్ర రంగంలో నోబుల్ బహుమతిని పొందిన సీవీ రామన్ 'రామన్ ఎఫెక్ట్' కనిపెట్టిన ఫిబ్రవరి 28వ తేదిన జాతీయ సైన్స్ డే గా నిర్వహించుకున్నట్లు జేవీవీ జిల్లా కోశాధికారి తిరుపతయ్య తెలిపారు. కార్యక్రమంలో జ్యోత్స్న, జి.ఉమామహేశ్వరి, పద్మశ్రీ, నల్లూరి వెంకటేశ్వరరావు, ఎన్‌టీ వెంకటేష్, డి.చంద్రశేఖర్, ఎన్ నాగేశ్వరరావు, సీహెచ్ లక్ష్మీనారాయణ, టీవీఆర్ సుబ్బారావు, జి.హరిబాబు, రత్నాకర్, తిరునారాయణ పాల్గొన్నారు.

వైవీని సన్మానించిన ఎమ్మెల్యే రాంబాబు



వైవీ సుబ్బారెడ్డిని సన్మానిస్తున్న ఎమ్మెల్యే అన్నా రాంబాబు, షంషీర్

మార్కాపురం: ఇటీవల రాజ్యసభకు ఏకగ్రీవంగా ఎన్నికైన వైవీ సుబ్బారెడ్డిని మంగళవారం రాత్రి తాడేపల్లిలోని ఆయన నివాసంలో గిద్దలూరు ఎమ్మెల్యే, మార్కాపురం వైఎస్‌ఆర్ సీపీ నియోజకవర్గ సమన్వయకర్త అన్నా రాంబాబు పార్టీ నాయకులతో కలిసి అభినందించి సన్మానించారు. ఈ సందర్భంగా వైవీ సుబ్బారెడ్డి మాట్లాడుతూ అన్నా రాంబాబు గెలుపునకు కలిసికట్టుగా కృషి చేయాలని, మంచి మెజార్టీ తేవాలని పార్టీ నాయకులకు సూచించారు. సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి గ్రామ స్థాయిలో అమలు చేసిన సంక్షేమ పథకాలను ప్రజలకు వివరించాలన్నారు. సంక్షేమ పథకాలన్నీ కొనసాగాలంటే వచ్చే ఎన్నికల్లో మళ్లీ జగనన్నను గెలిపిస్తూ ఫ్యాన్ గుర్తుపై ఓటు వేయాలన్నారు. ఎమ్మెల్యే రాంబాబు వెంట పార్టీ రాష్ట్ర కార్యదర్శి, ఏఎంసీ చైర్మన్ షంషీర్ అలీబేగ్, ఏఎంసీ డైరెక్టర్ డాక్టర్ మగ్బుల్‌బాషా ఉన్నారు.

నిత్య జీవితంలో సైన్స్‌తో ఉపయోగం

సాక్షి నెట్‌వర్క్: నిత్య జీవితంలో సైన్స్ ప్రాధాన్యతను మరచిపోలేమని గిద్దలూరు ఎమ్మెల్యే, మార్కాపురం నియోజకవర్గ వైఎస్సార్ సీపీ ఇన్‌చార్జ్ అన్నా రాంబాబు అన్నారు. బుధవారం జాతీయ సైన్స్ దినోత్సవాన్ని పురస్కరించుకుని మార్కాపురం పట్టణంలోని వాసవి విద్యానికేతన్‌లో వైజ్ఞానిక ప్రదర్శనను ఎమ్మెల్యే ప్రారంభించారు. జాతీయ సైన్స్ దినోత్సవం సందర్భంగా గిద్దలూరు, మార్కాపురం, యర్రగొండపాలెం, దర్శి నియోజకవర్గాల్లోని పలు పాఠశాలల్లో వేడుకలు నిర్వహించారు. పలుచోట్ల విద్యార్థులు సైన్స్ ప్రాజెక్టులు ప్రదర్శించారు. మార్కాపురంలోని అరవింద స్కూల్, శ్రీచైతన్య, కమలా కాన్సెప్ట్ స్కూల్, బేస్తవారిపేటలోని జెడ్పీ బాలికల హైస్కూల్, కంభంలోని వాసవీ విద్యానికేతన్, గొట్లగట్టులోని కేజీబీవీ, జెడ్పీ హైస్కూల్, కురిచేడులోని వైఆర్ జెడ్పీ హైస్కూల్, గిద్దలూరు జెడ్పీ బాలికల హైస్కూల్, తర్లుపాడు మండలం కలుజువ్వలపాడులోని జవహర్ నవోదయ విద్యాలయ–2లలో సైన్స్ ఎగ్జిబిషన్లు నిర్వహించారు. విద్యార్థుల్లో శాస్త్ర విజ్ఞానాన్ని పెంచేందుకు సైన్స్‌ఫేర్‌లు దోహదపడతాయని వక్తలు పేర్కొన్నారు. ఆయా కార్యక్రమాల్లో సబ్‌కలెక్టర్ రాహుల్ మీనా ట్రైనీ డీఎస్పీ షాహబాజ్ అహ్మద్, బేస్తవారిపేట జెడ్పీ బాలికల హైస్కూల్ హెచ్‌ఎం కర్నాటి తిరుపతిరెడ్డి, కంభం వాసవీ విద్యానికేతన్ డైరెక్టర్ కల్పన, సీఐ రామకోటయ్య, గొట్లగట్టు కేజీబీవీ ప్రిన్సిపాల్ రాఘవ సురేఖ, జెడ్పీ ఉన్నత పాఠశాల హెచ్‌ఎం విజయలక్ష్మి, మార్కాపురం అరవింద స్కూల్‌లో కరస్పాండెంట్ సి.వాణి, శ్రీచైతన్య హెచ్‌ఎం కృష్ణారెడ్డి, సీనియర్ మెడికల్ ఆఫీసర్ డాక్టర్ రాహుల్, ఆర్ఐ సురేంద్ర, డీన్ శ్రీనివాసులు, కమలా కాన్సెప్ట్ స్కూల్ ప్రిన్సిపల్ పుల్లయ్య పాల్గొన్నారు.